11నుంచి మద్యం అమ్మకాలు నిషేధం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11 సాయంత్రం 4.00 గంటల నుంచి మార్చి 13న సాయంత్రం 4.00 గంటల వరకూ జిల్లావ్యాప్తంగా మద్యం షాపులు, బార్లు, కల్లు దుకాణాలు, మద్యం కౌంటర్లు మూసివేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. అలాగే కౌంటింగ్ సందర్భంగా జెఎన్‌టియుకు ఐదు కిలోమీటర్ల పరిధిలో మార్చి 16వ తేదీ వరకూ మద్యం అమ్మకాలపై నిషేధం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు. పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు చేయనున్నట్లు తెలిపారు. నిబంధనలను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎసిబి అధికారులు అరెస్టుచేసిన వీఆర్వో లక్ష్మీదేవి, స్వాధీనం చేసుకున్న నగదు

ఎసిబి చేతికి అవినీతి రెవెన్యూ చేప

వీఆర్వో లక్ష్మీదేవిని అదుపులోకి తీసుకున్న అధికారులు

ప్రజాశక్తి-మడకశిర

సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం రోళ్ల మండలం దొడ్డేరి గ్రామానికి చెందిన వీఆర్వో లక్ష్మీదేవి పట్టాదారు పాసుపుస్తకం కోసం రూ.6 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. రొళ్ల మండలం దొడ్డేరి పంచాయతీ పరిధిలోని అప్పేపల్లి గ్రామానికి చెందిన గోవిందరెడ్డి, రంగమ్మ దంపతులు అనువంశికంగా వచ్చిన భూమిని సాగు చేసుకుంటున్నారు. 2006 సంవత్సరంలో రైతు గోవిందరెడ్డి మృతి చెందాడు. అనంతరం ఆయన భార్య పేరున భూమి పాసుబుక్కులు ఇచ్చారు. అయితే వీరి కుమారులు తిమ్మారెడ్డి, వెంకటాచలపతి లు పొలం భాగపరిష్కారం చేసుకోవడం కోసం 2.7.2021లో మడకశిర సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లారు. మీ పేరున పాసుబుక్ లేదా వన్ బి ఉంటేనే రిజిస్ట్రేషన్ అవుతుందని అధికారులు సూచించారు. దీంతో వారు దొడ్డేరి వీఆర్వో లక్ష్మీదేవిని సంప్రదించారు. ఆమె వన్ బి, పాస్‌బుక్ కావాలంటే రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే మధ్యవర్తుల చొరవతో రూ.9 వేలకు ఒప్పందం కుదుర్చుకుని రూ.3 వేలు అడ్వాన్స్ ఆమెకు ముట్టజెప్పారు. ఎన్ని రోజులైనా పాస్‌బుక్ ఇవ్వకపోవడంతో మళ్లీ వారు వీఆర్వోను సంప్రదించారు. అందుకు ఆమె మిగతా రూ.6 వేలు ఇస్తేనే పాసుబుక్కు ఇస్తామని స్పష్టం చేశారు. విధిలేని పరిస్థితుల్లో బాధితులు ఎసిబిని ఆశ్రయించారు. గురువారం తిమ్మారెడ్డి, వెంకటాచలపతి వీఆర్వోకు నగదు అందిస్తుండగా ఎసిబి డిఎస్‌పి ఆధ్వర్యంలో మెరుపు దాడులు చేశారు. నగదును స్వాధీనం చేసుకుని వీఆర్వో లక్ష్మీదేవిని అరెస్టు చేశారు.

హోరా హోరీ..

ఉధృతంగా ప్రచారాలు
రేపటితో ముగియనున్న ఎన్నికల ప్రచారం
ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శాసనమండలి పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికల ప్రచారాలు హోరా హోరీగా సాగుతున్నాయి. ప్రచారాలకు ఇక రెండు రోజులు మాత్రమే గడువుండటంతో ప్రధాన అభ్యర్థుల ప్రచారాలు తారా స్థాయికి చేరాయి. ఆరు జిల్లాలు కలిపి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గంగా ఉంది. పట్టభద్రులకు సంబంధించి 42 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన నాటి నుంచి అభ్యర్థులు ప్రచారాలు చేసుకుంటున్నారు. ఇక రెండు రోజులు మాత్రమే ప్రచారానికి సమయముంది. మార్చి 13వ తేదీన పోలింగు జరుగుతుంది. 11వ తేది సాయంత్రానికి ప్రచారాలను ముగించాల్సి ఉంటుంది. రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో అభ్యర్థులు ఆరు జిల్లాల్లోనూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆరు జిల్లాల్లో తిరగాల్సి రావడంతో తిరికలేకుండా ప్రచారాల్లో తలమునకలవుతున్నారు. వీరి తరపున ఆయా ప్రాంతాల్లో ప్రచారాలు చేస్తున్న వారూ ఉన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులు ముందంజ..

శాసనమండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి జరుగుతున్న ప్రచారాల్లో ప్రధాన పార్టీలకు ధీటుగా పిడిఎఫ్ అభ్యర్థులు పట్టభద్రులకు నాగరాజు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డిలు ప్రచారం చేస్తున్నారు. వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఉండగా, టిడిపి తరపున రాంగోపాల్‌రెడ్డి ఉన్నారు. వైసిపి అధికార బలంతోపాటు, ధనబలాన్ని నమ్ముకుని ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాలు సిద్ధం చేసుకుంటోంది. ప్రచారాలు ముగుస్తుండటంతో ప్రలోభాలకు తెరలేపేందుకు సన్నద్ధమైనట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక టిడిపి ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు తమకు లాభిస్తాయన్న ఆలోచనలో ఉంది. ఈ మేరకు ప్రచారాలు చేస్తున్నారు. ఇక పిడిఎఫ్ మాత్రం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక బలంతోపాటు, కాంగ్రెసు, జనసేన, సిపిఎం, సిపిఐలు మద్దతు ప్రకటించాయి. వారి తరపున పెద్దఎత్తున ప్రచారాలు చేస్తున్నారు. ప్రధాన అభ్యర్థుల కంటే పిడిఎఫ్ అభ్యర్థులు ప్రచారాల్లో ముందంజలో ఉన్నారని చెప్పవచ్చు.

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

పోలింగు సమయం దగ్గర పడుతుండటంతో ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలమునకలైంది. జిల్లా కలెక్టరు ఎస్.నాగలక్ష్మి రిటర్నింగు అధికారి కావడంతో ఆరు జిల్లాల్లో కలెక్టర్లను సమన్వయం చేసుకుని ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. అదే విధంగా జిల్లాలో బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల ఏర్పాట్లకు సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గురువారం నాడు ఎన్నికల్లో పాల్గొనే ప్రొసిడింగు అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగు సజావుగా జరిగేందుకు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యహరించాలని ఈ సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఓటరు స్లిప్పులతోపాటు, గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉంటేనే అనుమతించాలని ప్రొసిడింగు అధికారులకు సూచించారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సులు భద్రపరచడం, కౌంటింగు నిర్వహించడం జెఎన్‌టియు కళాశాలలో జరుగుతుంది. అక్కడి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన కలిగివుండాలి

ఓటర్ స్లిప్‌తో పాటు
గుర్తింపు కార్డు తప్పనిసరి
రిటర్నింగ్ అధికారి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల నిర్వహణ, నిబంధనలపై ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగివుండాలని అప్పుడే సజావుగా ఎన్నికలు నిర్వహించగలమని ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నియామావళిపై ప్రిసైడింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులకు నిర్వహిస్తున్న రెండవ రోజు శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మెటీరియల్‌లోని అంశాలను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలోనే అధికారులు తమకున్న సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల మెటీరియల్ తీసుకొని వెళ్లేసమయంలో వారికి అందిస్తున్న మెటీరియల్‌ని రిసెప్షన్ కౌంటర్‌లోనే సరి చూసుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రిసైడింగ్ అధికారులతో పాటు ఇతర సిబ్బంది సైతం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది ముందు రోజే పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారన్నారు. కాబట్టి వారు వారి పోలింగ్ కేంద్రాల్లోనే ఉండాలని, బయట తిరగరాదన్నారు. ఓటింగ్ కంపార్ట్‌మెంట్ ఎక్కడ ఉంచాలో చూసుకోవాలని, అక్కడ తగిన వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉదయం 7.30 గంటల కల్లా పోలింగ్ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాలకు పంపాలని అభ్యర్థులకు సూచించామన్నారు. అంతకుముందే పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని విధాల సన్నద్ధమై ఉండాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు వచ్చాక వారికి బ్యాలెట్ బాక్సులు చూపించి, ఖాళీగా ఉందని ధ్రువీకరించి, డిక్లరేషన్‌లో వారితో సంతకం తీసుకొని సీల్ చేయాలన్నారు. ఈనెల 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల తర్వాత వచ్చే ఓటర్లను అనుమతించాల్సిన అవసరం లేదన్నారు. అంతలోపు క్యూలో నిలబడి ఉన్న ఓటర్లకు టోకెన్లు ఇచ్చి వారిని మాత్రమే ఓటింగ్‌కు అనుమతించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా, ఎలా ఓటు వేయాలో తెలిపే పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్లు ఓటర్ స్లిప్పుతో పాటు ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డును కూడా తప్పనిసరిగా తీసుకొని రావాల్సి ఉంటుందన్నారు. గ్రాడ్యుయేట్స్ ఓటు వేయడం కోసం రెండు కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్స్ ఒక్కటే ఉంటుందన్నారు. ఓటర్ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి తనకు నచ్చిన అభ్యర్థికి ప్రాధాన్యత క్రమంలో అంకెలు వేసి, బ్యాలెట్ పేపర్‌ను సక్రమంగా మడిచి బ్యాలెట్ బాక్స్‌లోకి వేయాలన్నారు. ఓటరు పోలింగ్ కేంద్రంలోనికి వచ్చేటప్పుడు తనతో పాటు సెల్‌ఫోన్ తీసుకురాకూడదని తెలిపారు. పీవో ఇచ్చిన పెన్‌తో బ్యాలెట్ పేపర్‌లో ప్రాధాన్యత అంకెలను వేసి తిరిగి ఆపెన్ను అధికారికి అప్పగించేలా సిబ్బంది తగిన జాగ్రత్త వహించాలన్నారు. పోలింగ్ పూర్తయ్యాక వీలైనంత త్వరగా సీలింగ్, ఇతర మెటీరియల్ ప్యాకింగ్ చేసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్ అకౌంటు, పేపర్ సీల్ అకౌంట్, పిఓ డైరీ, సక్రమంగా సిద్ధం చేసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్లు ఎన్ని ఉన్నాయి? ఎన్ని వాడారు, వాడనివి ఎన్ని పరిశీలించి బ్యాలెట్ పేపర్ అకౌంట్‌తో సరి చూసుకోవాలన్నారు. పిఓ డైరీ సక్రమంగా పూరించి ఉండాలన్నారు. ఫార్మాట్‌లన్నీ సక్రమంగా పూరించాలన్నారు. డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎన్నికల శిక్షణ అధికారి నరసింహారెడ్డి ఎన్నికల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, డిఆర్ఓ గాయత్రీ దేవి, కళ్యాణదుర్గం, గుంతకల్ ఆర్‌డిఓలు ఎ.నిశాంత్ రెడ్డి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్

నారసింహుడి రథోత్సవానికి ప్రత్యేక బస్సులు

సత్యసాయి జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణంలో ఈనెల 13వ తేదీ సోమవారం నిర్వహించనున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవానికి విచ్చేయు భక్తుల సౌకర్యార్థం డిపోలో ఉన్న 114 బస్సులకు అదనంగా 30 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు సత్యసాయి జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. గురువారం కదిరి డిపో కార్యాలయంలో రథోత్సవం సందర్భంగా ప్రయాణికుల సౌకర్యాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అదనపు బస్సుల వివరాలను వెల్లడించారు. కదిరి నుండి గోరంట్ల మీదుగా హిందూపురంకు 26 బస్సులు, నల్లమాడకు 7 బస్సులు, మదనపల్లికి 25 బస్సులు, బెంగుళూరుకు 20 బస్సులు, పులివెందులకు 9 బస్సులు, తలుపులకు 7 బస్సులు దాదాపు 117 ట్రిప్పులతో బస్సులను నడుపుతామని తెలియజేశారు. బ్రహ్మ రథోత్సవానికి విచ్చేయు వేలాది మంది భక్తాదులకు రవాణా సౌకర్యం ఏర్పాట్లపైన కదిరి డిపో సూపర్‌వైజర్లు, ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. ధర్మవరం, గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, డిపోల నుండి 30 కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను తెప్పిస్తున్నామని అన్నారు. స్థానిక జీవిమాను సర్కిల్, వేమారెడ్డి సర్కిల్, బస్టాండు, సరస్వతి విద్యామందిరం వద్ద ప్రయాణికులకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నామని డిపో మేనేజర్ మైనుద్దీన్ తెలిపారు. మంచినీటి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, ప్రతి షెల్టరులో ఇద్దరు పోలీసులను (ఆర్టీసీ కానిస్టేబుల్స్), ఇద్దరు సేఫ్టీ డ్రైవింగ్ శిక్షకులను, ఇద్దరు వాలంటీర్లను, సుపర్‌వైజర్లను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ప్రయాణికులు తమ సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లోనే రావాలని కోరారు. ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాలకు, ఇబ్బందులకు గురికావొద్దని సూచించారు. ఈ సమావేశంలో డిపో మేనేజరు మైనుద్దీన్, అసిస్టెంట్ మేనేజరు హరిమోహన్, అసిస్టెంట్ ఇంజినీరు రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-గుత్తి

పెండింగ్‌లో ఉన్న డిఎలతోపాటు పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఉద్యోగులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన డిఎలను చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం అన్యాయమన్నారు. వెంటనే తమకు రావాల్సిన బకాయిలు, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ వెంకటరెడ్డి, మేనేజర్, మున్సిపల్ ఉద్యోగులు ఇమాం హుస్సేన్, షేక్షావల్లి, సతీష్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : బకాయిలు చెల్లించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు రెవెన్యూ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ పెండిండ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు

వీధి కుక్కల నియంత్రణకు సహకరించాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో వీధి కుక్కలను నియంత్రించేందుకు జంతు ప్రేమికులు, ప్రజలు సహకరించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవాని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల బాధపడి పసిపిల్లలు మృత్యువాత పడుతున్న విషయం తెలిసిందే అన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వీధి కుక్కల నియంత్రణకు కీలక నిర్ణయం తీసుకుని నియంత్రణకు జిల్లాల వారీగా కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ సూచనల మేరకు ప్రజా సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకుని వెటర్నరీ శాఖ సహకారంతో మున్సిపాలిటీ సంయుక్తంగా వీధి కుక్కలను అదుపులోకి తీసుకోనున్నట్లు తెలిపారు. తర్వాత రేబీస్ వ్యాధి నివారణ వ్యాక్సిన్ ఇంజెక్షన్లు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. పెంపుడు కుక్కలకు ఇప్పటికే రేబిస్ వ్యాధి నివారణ వ్యాక్సిన్లు వేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా కుక్కల బెడదను నివారించాలని తమకు అనేక ఫిర్యాదులు అందాయన్నారు. ఈనేపథ్యంలో పట్టణంలో సుమారుగా 3,024 వీధి కుక్కలు ఉన్నట్లుగా గుర్తించామన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా చేరి ప్రజలు, పిల్లలను భయాందోళనకు గురి చేస్తున్నాయన్నారు. వీటి నివారణకు ప్రజలు, జంతు ప్రేమికులు సహకరించాలన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవాని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

పెన్షనర్లకు బకాయిలు చెల్లించాలి

డిఆర్‌ఓ, డిటిఓ, ఆర్‌డిఓలకు వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు బకాయి ఉన్న డిఆర్ అరియర్స్ తక్షణమే చెల్లించాలని ఎపి పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు బి.పెద్దన్నగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా రెవెన్యూ అధికారి గాయిత్రిదేవి, జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మ విజయకుమారి, ఆర్‌డిఓ మధుసూదన్‌కు విడివిడిగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్ మాట్లాడుతూ పెన్షనర్స్‌కు డిఏ అరియర్స్‌తో పాటు ప్రస్తుతం బకాయి ఉన్న డిఆర్ విడుదలకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. 11వ పిఆర్‌సి అరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. పెన్షనర్‌లకు పే ఫిక్షేషన్ స్టేట్‌మెంట్ ఇవ్వాలన్నారు. 11వ పిఆర్‌సిలో ఉన్న పలు అసంబద్ధతలు సవరణకు అనామలీస్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. 1-7-2023 నుంచి నూతన వేతన సవరణలు అమలు చేయాల్సి ఉన్నందున తక్షణమే 12వ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఇటీవల కాలంలో పెన్షన్‌లు చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతున్నందున పెన్షనర్‌లకు ప్రతి నెల పెన్షన్ కోసం ఎదురు చూడడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. కావున ప్రతి నెల 1వ తేదిన పెన్షన్ జమ చేసేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హెల్త్‌కార్డ్‌లపై క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అన్ని ఆసుపత్రుల్లో సమస్త వ్యాధులకు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్స్ తక్షణమే చెల్లించాలనానరు. పెన్షనర్‌లు, వారి కుటుంబ సభ్యులకు మాస్టర్ హెల్త్ చెకప్ అమలు చేయాలన్నారు. స్పందించిన డిఆర్‌ఓ గాయిత్రిదేవి పెన్షనర్‌ల సమస్యలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం జిల్లా కోశాధికారి రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, ఉపాధ్యక్షులు మొహమ్మద్, రమేష్‌కుమార్, నారాయణ, సంయుక్త కార్యదర్శులు వరదరాజులు, ఈసీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ప్రభుత్వ పెన్షనర్ అసోసియేషన్ రాయదుర్గం శాఖ అధ్యక్షుడు రామాంజనేయులు, అసోసియేట్ అధ్యక్షులు ముత్యాల్‌రెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మారుతి, ఉప ఖజానా కార్యాలయంలో ఉప ఖజానా అధికారి యుగంధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు బత్యం, 11వ వేతన సవరణ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ముఖ్యంగా పెన్షనర్లకు హెల్త్ కార్డులపై అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందించాలని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రిలో ఓపి చికిత్స సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా 1వ తేదీనే పెన్షన్ చెల్లించాలని, 12వ వేదన సవరణ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్, ఉప ఖజానా అధికారి స్పందిస్తూ ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

గుత్తి : పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షులు కె.అబుబకర్, కార్యదర్శి రామ్మోహన్ అదనపు కార్యదర్శి జేన్నే కుళ్లాయిబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎస్.మహబుబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 నుంచి బకాయి డిఆర్ అరియర్స్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. అలాగే 11వ పిఆర్సీ అరియర్స్ ఇవ్వాలని, 12వ పే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని, ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ సొమ్మును జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం మండల ఉపాధ్యక్షులు స్వర్ణాంబ, వెంకటేష్, కోశాధికారి పకద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రెవెన్యూ అధికారి గాయిత్రిదేవికి వినతిపత్రం సమర్పిస్తున్న పెన్షనర్స్ సంఘం నాయకులు

రాయదుర్గంలో తహశీల్దార్ మారుతీకి వినతిపత్రం సమర్పిస్తున్న పెన్షనర్స్

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-కుందుర్పి

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి, ప్రజా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం, పరిశ్రమల ఏర్పాటు వంటి సమస్యలను మండలిలో నిలదీయాలంటే తప్పనిసరిగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి క్రిష్టమూర్తి, సిఐటియు కళ్యాణదుర్గం నియోజకవర్గ నాయకులు అచ్యుత్, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే శెట్టూరులో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా సిపిఎం నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్యచ సిఐటియూ జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్, కళ్యాణదుర్గం మండల కార్యదర్శి రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజుకు, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ కోరారు. ఈమేరకు గురువారం మండలంలోని పలు ప్రాంతాల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ చేస్తున్న పోతుల నాగరాజు తన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకుని 32 సంవత్సరాలుగా అనేక ఉద్యమాల్లో భాగస్వామ్యం అయ్యి ఆందోళనలు చేస్తున్నారన్నారు. అంతేగాకుండా విద్యార్థి నాయకుడిగా, సామాజిక కార్యకర్తగా, వెనుకబడిన కులాల ఐక్యవేది కన్వీనర్‌గా, మహాత్మా పూలే ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకునిగా పని చేస్తూ విశేష సేవలు అందిస్తున్నారన్నారు. ఆయన్ను గెలిపిస్తే రాయలసీమ అభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీల భర్తీ కోసం, పెన్షనర్ హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, మునెప్ప, కేశప్ప, కృష్ణమూర్తి, నల్లప్ప, కుమార, నాగేంద్ర, శంకర, నరసింహా, రత్నక్క, చంద, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, నాగేంద్ర, పెద్దన్న, ప్రభాస్, పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పిలో పట్టభద్రులను ఓటు అడుగుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, నాయకులు

శింగనమలలో ఓటర్లను అభ్యర్థిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, నాయకులు

పుట్లూరు : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం మండలంలోని మడ్డిపల్లి, కుమ్మనమల, రంగరాజుకుంట, చాలవేముల, తదితర గ్రామాల్లో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల గొంతుక మండలిలో వినిపించాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, మండలాధ్యక్షుడు రామంజి, సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయ సంఘం అధ్యక్షుడు వెంకటచౌదరి, డి.పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న చెన్నకేశవులు

విడపనకల్ ఆసుపత్రి తనిఖీ

ఉరవకొండ : విడపనకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం నిర్వహణాధికారి డాక్టర్ చేన్నకేశవులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ప్రతినెలా నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమానికి వచ్చే గర్భిణులను పరీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను వివరించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే వైఎస్ఆర్ సంపూర్ణ పోషకాహారాన్ని సక్రమంగా అందించాలని, రక్తహీనత లేకుండా ఇరన్ మాత్రలు సరఫరా చేయాలని, ప్రతినెలా గర్భిణులకు పరీక్షలు చేయాలని, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా పరీక్షలు చేయించాలని సూచించారు. అనంతరం కాన్పుల రిజిస్టర్, ఒపి, ఐపి, ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ రిజిస్టర్, బాలింతల వార్డు, ల్యాబ్, ఫార్మసీని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు జెవి.శ్రీధర్, పి.ప్రమీలాదేవి, కమ్యూనిటీ హెల్త్ఆఫీసర్ కెసి.మునెమ్మ, జి.జయభారతి, వైద్య సిబ్బంది షర్మాస్‌వలి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 21 మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ కార్యాలయంలో ఇండో ఎఐఎం ప్రయివేట్ లిమిటెడ్ తిరుపతి కంపెనీ వారు గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 21 మంది ఎంపికైనట్లు రెక్టార్, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) ఇన్‌ఛార్జి ఉపకులపతి ఎం.విజయకుమార్ తెలిపారు. ముందుగా కంపెనీ ప్రతినిధులు జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్, కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత, డైరెక్టర్ ఇండస్ట్రీయల్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ వి.సుమలతను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా క్యాంపస్ ప్లేస్ మెంట్స్ లో మంచి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి ఉద్యోగావకాశాలను కోర్ కంపెనీలో ఎక్కువగా కల్పిస్తున్నట్లు తలెఇపారు. ఈ జాబ్‌మేళాలో 45 మంది బీ.టెక్ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొనగా 21 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులకు టెక్నికల్ ఇంటర్వ్యూలు నిర్వహించామని, త్వరలో ఫలితాలను ప్రకటిస్తారని కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి జె.శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఆర్ మేనేజర్ హరీష్, సీనియర్ ఆపరేషన్ మేనేజర్ బిందుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు అధికారులతో ఇండో ఎఐఎం కంపెనీ ప్రతినిధులు

మహిళలకు రక్షణ కరువు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో వైసిపి వచ్చా మహిళలకు స్వేచ్ఛ, రక్షణ లేకుండా పోయిందని టిడిపి వార్డు సభ్యురాలు కురుబ ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకీ లైంగిక వేధింపులు, హత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. 1986లోనే మహిళలకు ఆస్తిలో సమాన హక్కును కల్పించిన ఘనత టిడిపికి దక్కుతుందన్నారు. అంతేగాకుండా స్థానిక సంస్థల పదవులు, విద్యలో ఆడపిల్లలకు రిజర్వేషన్లు తెచ్చింది కూడా టిడిపినే అని గుర్తు చేశారు. అలాగే దీపం పథకం ద్వారా కట్టెల పొయ్యికి విముక్తి కలిగించి, ఇంటింటికీ సబ్సిడీ గ్యాస్ కనెక్షన్లు అందించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. దేశంలోనే తొలిసారిగా మహితా సాధికారిత వ్యవస్థ, డ్వాక్రా గ్రూపుల వ్యవస్థను తీసుకొచ్చింది తెలుగుదేశం అన్నారు. తద్వారా మహిళల ఆర్థిక పరిపుష్టి, పురోగతి చెందారన్నారు. టిడిపి ప్రభుత్వం మహిళల కోసం తీసుకొచ్చిన అనేక సంక్షేమ పథకాలను సిఎం జగన్ రద్దు చేశాడన్నారు. అవన్నీ తిరిగి రావాలన్నా.. మహిళల సంక్షేమం, రక్షణకు పెద్దపీట వేయాలన్నా టిడిపి అధికారంలోకి వచ్చి చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం మహిళలంతా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు సభ్యురాలు బళ్లారి జ్యోతి, టిడిపి రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి సంపత్‌కుమారి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముదిగల్లు జ్యోతి, మాజీ కౌన్సిలర్ సుమలత, నాగమణి, ఉమ, గౌరీ, పద్మ, విజయకుమారి, సువర్ణమ్మ, శకుంతల, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వార్డు సభ్యురాలుకురుబ శాంతి

ఉద్దేశపూర్వకంగానే తొలగించారు..

చిక్కనేశ్వర స్వామి ఆలయ అర్చకుడు బసవరాజ్‌శాస్త్రి

ప్రజాశక్తి-కణేకల్లు

మండల కేంద్రంలోని చిక్కనేశ్వర ఆలయ అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న తను ఆలయ ధర్మకర్త, పలువురు గ్రామ పెద్దలు ఉద్దేశపూర్వకంగా తొలగించారని అర్చకుడు బసవరాజ్‌శాస్త్రి ఆరోపించారు. గురువారం స్థానిక చిక్కనేశ్వర కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై అసత్య, అక్రమ సంబంధం ఆరోపణలు వచ్చాయన్నారు. వీటిని ఆసరా చేసుకుని ఆలయ ధర్మకర్త ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల ఏకపక్ష నిర్ణయంతో తనను అర్చకుడుగా తొలగిస్తున్నట్లు తన కన్నతల్లికి చెప్పారని తెలిపారు. వీరందరూ సమావేశం నిర్వహిస్తున్నట్లు తనకు ఒక్కమాట కూడా చెప్పలేదన్నారు. వీరు సమావేశం పెట్టుకున్న రోజు కర్నూలులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా తన తల్లి ఫోన్ చేసి చెప్పిందన్నారు. దీంతో తాను ఆలయ ధర్మకర్త ప్రసాద్‌కు 20 సార్లు ఫోన్ చేసినా స్పందించలేదన్నారు. తనపై వచ్చిన ఆరోపణలపై నిజా నిజాలు తెలియకుండా తొలగించడం సమంజసం కాదన్నారు. కనీసం ఎండోమెంట్ అధికారికి కూడా తెలియకుండా తొలగించడం బాధాకరమన్నారు. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, నిజానిజాలు తేల్చే వరకు కోర్టుకు వెళ్తానన్నారు. రెండు రోజుల్లో తనపై వచ్చిన ఆరోపణలను రుజువు చేయకపోతే ఆదివారం నుంచి యథావిధిగా స్వామివారి సేవలకు నిర్వహించేందుకు వెళ్తేనన్నారు.

మాట్లాడుతున్న అర్చకుడు బసవరాజ్‌శాస్త్రి

జెసి సోదరులది రాచరిక పాలన

పెద్దారెడ్డిది ప్రజాస్వామ్య పాలన : బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

తాడిపత్రి నియోజకవర్గంలో గతంలో జెసి దివాకర్‌రెడ్డి సోదరులు రాచరిక పాలన సాగిస్తే... కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ప్రజాస్వామ్య పాలన వచ్చిందని శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఎమెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర గురువారం మండల కేంద్రంలో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ జెసి సోదరులు అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్టర్ల దగ్గర నిస్సిగ్గుగా కమీషన్లు వసూలు చేశారని విమర్శించారు. అధికారం పోయాక జెసి సోదరులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. గ్రామాల్లో బలహీనులపై పెత్తనం చేసుకుంటూ ఫ్యాక్షని పేరేపించిన జెసి సోదరులకు పెద్దారెడ్డిని విమర్శించే అర్హత లేదన్నారు. మూడున్నరేళ్ల పాలనలో పెద్దారెడ్డి ప్రజల మనస్సులను దోచుకున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఆఖరికి టిడిపి అధినేత చంద్రబాబుకు కూడా కుప్పంలో ఓట్లు పడే పరిస్థితి లేదన్నారు. అందుకే ప్రతి నెలకోసారి అక్కడి వెళ్లి తన శేష జీవితం కుప్పంలోనే గడుపుతానని అంటున్నాడని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ వాసు యాదవ్, మండలాధ్యక్షుడు రాముడు రెడ్డి, ఉపాధ్యక్షులు రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

సామాజిక ఆర్థికాభివృద్ధికి కృషి

అనంతపురం : సామాజిక ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేయాలని హైదరాబాద్ జెఎన్‌టియు డాక్టర్ ఎంటి.నాయక్ సూచించారు. గురువారం అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం సెమినార్ హాల్‌లో బీటెక్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ప్రొఫెసర్ కళ్యాణి రాధ, మెకానికల్ బిటెక్ విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ : మండలంలోని పెన్నహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామిని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ద్వారకానాథ్, బాలాజీస్వామి, తదితరులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మర్యాదలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE:GOOTY
O.S.NO:85/2018.
Between:
Kondaveeti Ravindra Naidu ...plaintiff
And
Kanakadandi Seetharama Murthi ...Defendant
Notice To Defendent
Kanakadandi Seetharama Murthi S/o Venkata Subbaiah Sarma Working as a Teacher at Z.P.H School, Gorvimanu Palli Village, Kolimigundla Mandal, Now R/at D.No:3/752-A, Besides Kodhandarama Swamy Temple, Gannevari Palli Colony, Tadipatri.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 10-03-2023వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
P.KONDAIAH, ADVOCATE, TADIPATRI
B.JAYARAMI REDDY, ADVOCATE, GOOTY.

పెద్దారెడ్డి యాత్రకు వంశీ గోకుల్‌రెడ్డి సంఘీభావం

ప్రజాశక్తి-శింగనమల

తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పెద్దపప్పూరు మండలంలో చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్రకు శింగనమల నియోజకవర్గ వైసిపి యూత్ నాయకులు తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి గురువారం సంఘీభావం ప్రకటించి యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేతిరెడ్డి పెద్దారెడ్డి తనకంటే చిన్నవాడైనా అన్నా అంటూ గౌరవంగా సంబోధిస్తూ అందరినీ కలుపుకుపోయే నాయకుడు అని కొనియాడారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచిన మూడున్నరేళ్లలో ఎలాంటి ఫ్యాక్షన్ లేకుండా ప్రజలను కాపాడుకుంటూ వస్తున్నాడన్నారు. గతంలో రక్తపాతానికి గురైన ఈ ప్రాంతంలో నేడు శాంతికుసుమాలు పూయించడంలో పెద్దారెడ్డి పాత్ర అభినందనీయమన్నారు. అంతేగాకుండా ఆయన చేస్తున్న పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రామకృష్ణ, పప్పూరు మధురెడ్డి, మాజీ సర్పంచి ఆదినారాయణ, రాచేపల్లి ఉప సర్పంచి గంగిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, ఓబులేసు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పెద్దారెడ్డితో తరిమెల వంశీగోకుల్‌రెడ్డి

సైబర్ నేరాలపై అవగాహన

తాడిపత్రి రూరల్ : ప్రస్తుత సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ విఎంకె చైతన్య సూచించారు. గురువారం రూరల్ పరిధిలోని స్టీల్‌ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అంతా డిజిటల్‌మయం అయిందన్నారు. ఈ డిజిటల్ ప్రపంచంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఇందులో కూడా లోన్‌యాప్స్, చైల్డ్ ఫోర్నోగ్రఫీ వంటి నేరాలు ఎక్కువ అయ్యాయన్నారు. ముఖ్యంగా ఈకామర్స్ సైబర్ బిల్లింగ్ ద్వారా ఓటీపీలు, అనవసరమైన లింకులను ఎవరికీ షేర్ చేయకూడదన్నారు. ఒకవేళ ఎవరైనా తమ అకౌంట్లలో డబ్బులు పోగొట్టుకున్నట్లు తెలిస్తే వెంటనే 1930కి ఫోన్ చేసి తెలియజేస్తే తిరిగి రప్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ చిన్న పెద్దయ్య, స్టీల్ ప్లాంట్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ చైతన్య

కాలవ.. నోరు అదుపులో పెట్టుకో..

రాయదుర్గం : మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వైసిపి ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు వి.భోజరాజునాయక్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. విప్ కాపు రామచంద్రారెడ్డిని వెదవా.. అని మాట్లాడటం మంచి ది కాదన్నారు. రాయదుర్గంలో టిడిపి తరపున పోటీ చేసిన 99 శాతం మంది ఓడిపోయి.. ఒక సీటు గెలిచినంత మాత్రాన ఆయన హీరో అవుతాడా.. అని ప్రశ్నించారు. ఒకరు గెలిచినంత మాత్రాన హీరో అయితే.. 99 శాతం గెలిచిన వాళ్లు ఏమవుతారో వాళ్లే తెలుసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ జరిగిన అన్ని ఎన్నికల్లో టిడిపిని మట్టి కరిపించినా ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లో తిరుగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. డ్రామా ఆర్టిస్టులా ఫుల్‌గా మేకప్ వేసుకుని డ్రామాలాడుతూ నోటికి వచ్చింది మాట్లాడితే ప్రజలు తరిమి తరిమి కొడతారన్నారు. విప్ కాపును, సిఎం జగన్‌ను, వైసిపిని విమర్శించడం తప్ప మీరు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా డ్రామాలు ఆపాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలి

ఉరవకొండ : గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని విడపనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని అరుణకుమారి సూచించారు. ప్రధానమంత్రి సురక్షత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా గురువారం పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 43 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో 17 మంది హైరిస్క్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఎత్తు, బరువు,హెచ్ఐవి వంటి పరీక్షలు చేశారు. రక్తం తక్కువగా ఉన్నవారికి ఐరన్ సుక్రోస్ ఎక్కించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు నాలుగుసార్లు వైద్య పరీక్షలు చేసుకోవడంతోపాటు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. అలాగే కాన్పుల కోసం 108 వాహనాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు శివానంద దంపతులు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎం జాఫర్, స్టాఫ్‌నర్స్ జయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ ఈశ్వర్‌నాయక్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ

నార్పల : మండల కేంద్రంలోని శేషయ్యస్వామి వృద్ధాశ్రమంలో మాజీ జెడ్పిటిసి జయసింహా వర్ధంతిని పురస్కరించుకుని ఆయన భార్య, మాజీ సర్పంచి ఆకుల నాగ లలిత దుస్తులను వితరణ చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జయసింహా నార్పల మండల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. అనంతరం సత్యసాయి అనాథాశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

నేరాలు ఘోరాలు

అగ్ని ప్రమాదంలో రెండు బంకులు దగ్ధం

గుత్తి : పట్టణంలోని రాజీవ్ గాంధీ సర్కిల్లో ఓ టింబర్ డిపో ఎదురుగా ఉన్న రెండు బంకులు గురువారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యాయి. కోడిగుడ్లు విక్రయించే దుకాణం, వుడ్ వర్క్‌షాప్‌లకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు లేచాయి. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ మున్సిపాలిటీ ట్యాంకర్ల నీటితో మంటలను ఆర్పించారు. అప్పటికే రెండు బంకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ.30వేలు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు వాపోయారు.

మంటలను ఆర్పుతున్న స్థానికులు

మద్యం బాటిళ్లు ధ్వంసం

రాయదుర్గం : గుమ్మగట్ట పోలీసుస్టేషన్ పరిధిలో 21 కేసుల్లో పట్టుబడిన 3999 అక్రమ మద్యం ప్యాకెట్లను అధికారులు గురువారం ధ్వంసం చేశారు. ఎస్‌పి ఆదేశాల మేరకు గుమ్మగట్ట మండలం భైరవాన్‌తిప్ప రిజర్వాయర్ వద్ద ఉన్న బయలు ప్రదేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, రాయదుర్గం రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యుగంధర్, గుమ్మగట్ట ఎస్ఐ సమక్షంలో 3999 (90ఎంఎల్) టెట్రా ప్యాక్కెట్లను జెసిబి సాయంతో ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన మద్యం విలువ సుమారు రూ.1,44.252 ఉంటుందని ఎస్ఐ సునీత తెలిపారు.

వివాహానికి ఆర్థికసాయం

శింగనమల : మండలంలోని తరిమెలకు చెందిన ఉబ్బు రాణిశ్రీ, యల్లప్ప కుమారుడు గంగాధర్ వివాహనికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు గురువారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా దండు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థికసాయం చేయడం సంతోషకరంగా ఉంటుందన్నారు. వారి వైవాహిక జీవితం ఆనందంగా, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు కుమార్, సోము, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న దండు శ్రీనివాసులు

ఆంధ్ర కబడ్డీ జట్టుకు పాల్తూరు విద్యార్థి ఎంపిక

ఉరవకొండ : ఆంధ్ర కబడ్డీ జట్టుకు విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వరుణ్‌కుమార్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వమంగళ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈమేరకు గురువారం స్థానిక పాఠశాలలో విద్యార్థిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరపున అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా మంచి ఫలితాలు సాధించి చదువుతోపాటు క్రీడల్లోనూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శ్రీనివాసరాజు, ఎర్రిస్వామి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత దిశగా అడుగులు : ఎసిడిపిఒ

గుంతకల్లు : సమాజంలో మహిళలు అధైర్య పడకుండా ధైర్యంగా ముందుకెళ్తూ సాధికారత దిశగా అడుగులు వేయాలని గుత్తి అంగన్‌వాడీ ప్రాజెక్టు ఎసిడిపిఒ ఢిల్లీశ్వరి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సత్యనారాయణ పేటలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఎందులోనూ తక్కువ కాదని, పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. అంతేగాకుండా మహిళలు ఏచిన్న విషయానికీ కుంగిపోకుండా ధైర్యంగా సమస్యలను అధిగమించాలని సూచించారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీదేవి, పుష్ప, షాహిదా, సచివాలయ మహిళా పోలీసు జయలక్ష్మి, ఎఎన్‌ఎం భారతి, చైల్డ్‌లైన్ టీం సభ్యులు భాగ్యలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

పుల్లన్న మృతికి కారణమైన ఆసుపత్రిపై చర్యకు డిమాండ్

గుత్తి : వైద్యం వికటించి పుల్లన్న మృతికి కారణమైన పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న ఓ ప్రయివేటు ఆసుపత్రి నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు డాక్టర్ సి.తిరుపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆసుపత్రి వద్ద ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్లు మండలం వైటి చెరువు గ్రామానికి చెందిన పుల్లన్న గతనెల 21న సేఫ్ ఆసుపత్రికి వైద్య చికిత్స నిమిత్తం వచ్చాడు. అయితే వైద్యం వికటించి మృతిచెందాడన్నారు. కావున పుల్లన్న కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ జిల్లా నాయకురాలు కె.సునీత, నాయకులు చంద్ర, వంశీకృష్ణ, చంద్రశేఖర్, దేవి తదితరులు పాల్గొన్నారు.

ధూమపాన వ్యతిరేక దినోత్సవం

గుత్తి : పట్టణంలోని శ్రీసాయి ఉన్నత పాఠశాలలో రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ విమోచన సమితి కన్వీనర్ వై.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతారన్నారు. ధూమపానం సేవించడంతో కుటుంబ సభ్యులు కూడా అనారోగ్యం పాలవుతారన్నారు. కావున పొగాకు ఉత్పత్తుల వాడకానికి ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం సుంకన్న, ఉపాధ్యాయులు నూర్జహాన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాయలసీమ విమోచన సమితి కన్వీనర్ వై.రాజశేఖర్‌రెడ్డి

గవిమఠం హుండీ లెక్కింపు

ఉరవకొండ : పట్టణంలో ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన గవిమఠం గవిసిద్దేశ్వర స్వామి హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను అధికారులు గురువారం లెక్కించారు. గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఉండబండ ఈఓ రమేష్ బాబు ఆధ్వర్యంలో హుండీలను లెక్కించగా 170 రోజులకు రూ.88,275 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ తెలిపారు. ఈకార్యక్రమంలో మఠం సిబ్బంది, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

తాడిపత్రిరూరల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని గుత్తి ఉప విద్యాశాఖాధికారి డిటి.శంకర్‌ప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని చుక్కలూరు గ్రామపంచాయతీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి చదివే ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు కలలుగన్న జీవితాన్ని నెరవేర్చడానికి కష్టపడి చదివి పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాలన్నారు. అలాగే ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వ అందించిన లాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.